

తూంకుంట పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

జహీరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంకుంట పంచాయతీ కార్యదర్శి బీరప్పను సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా ఉత్తర్వులు జారీచేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో ఓ వెంచర్ ఏర్పాటుకు అనుమతుల్లో అవకతవకలకు పాల్పడ్డారని గోతేడాది గ్రామానికి చెందిన కొందరు కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. విచారణలో ఆరోపణలు నిజమేనని తేలడంతో బీరప్పను సస్పెండ్ చేస్తూ డీపీవో ఈ నెల 18న ఉత్తర్వులను వెలువరించారని ఎంపీడీవో తెలిపారు.

వర్షాకాలం.. జర పైలం
పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు 7

మున్సిపాలిటీ మురిపెం
మూన్నాళ్ల ముచ్చటేనా?
కోహీర్‌లో పనిచేసేందుకు అధికారుల వెనకడుగు 8



పొంగిపొర్లుతున్న ఘనపురం ఆనకట్ట



ముసురేసింది..

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఎడతెరిపి లేని వాన

ఈ సీజన్‌లో తొలిసారి నిండుతున్న జలవనరులు

పొలం పనుల్లో రైతులు బిజీబిజీ

జోరందుకున్న వరి నాట్లు

పొంగిపొర్లుతున్న ఘనపురం ఆనకట్ట

మెదక్/మెదక్ అర్బన్/పాపన్నపేట/కొల్చారం/వెల్దుర్తి/సంగారెడ్డిక్రైం/నాగల్‌గిద్ద/మనూర్/కల్హేర్/సంగారెడ్డి టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. ఇళ్ల నుంచి బయటకు వెళ్లనివ్వకుండా ముసురు కమ్ముకుంది.

మెదక్ జిల్లాలో గత 24 గంటల్లో హవేళీఘనపురంలో 26.4మిమీ., పాపన్నపేటలో 25.9 మి.మీ., పెద్దశంకరంపేటలో 25.7 మి.మీ., మెదక్ లో 25.4 మి.మీ., మనోహరాబాద్‌లో 24.3 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అల్లాదుర్గం, వెల్దుర్తి, టేక్మాల్, నర్సాపూర్, చిలప్‌చేడ్, నిజాంపేట, రామాయంపేట, రేగోడ్, తూప్రాన్, నార్సింగి, చేగుంట, కౌడిపల్లి తదితర మండలాల్లో జల్లులు కురుస్తున్నాయి. ఘనపురం ప్రాజెక్టు పొంగిపొర్లుతోంది. ఫతేనహర్, మహబూబ్ నహర్ కాలువకు సాగు నీరు విడుదల చేశారు. ఆనకట్ట కింద 25 వేల ఎకరాల్లో నాట్లు జోరందుకున్నాయి.

మెదక్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం..

నంబర్ 9391942254

మెదక్ జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. వరదలు, ఇళ్లకు నష్టం, రహదారులు ధ్వంసం, చెట్లు విరిగిపడడం వంటి విపత్కర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. అత్యవసరమైతే 9391942254 నంబర్‌లో కంట్రోల్ రూంకు తెలియజేయాలని సూచించారు.

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి జిల్లాలో గడిచిన 24 గంటల్లో 7.1 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మొగుడంపల్లి మండలంలో అత్యధికంగా 16.9 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా.. నిజాంపేటలో అత్యల్పంగా ఒక మి.మీ. వర్షం కురిసింది. అమీన్‌పూర్‌లో 13.5 మి.మీ., రాయికోడ్‌లో 10.5 మి.మీ., ఝరాసంగంలో 9.9 మి.మీ., పటాన్‌చెరులో 9.4 మి.మీ., కొండాపూర్‌లో 9.2 మి.మీ., సదాశివపేటలో 9.1 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

ఊపందుకున్న పంటల సాగు

నిన్నమొన్నటి వరకు వానలు లేక నామమాత్రంగా సాగిన వరినాట్లు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జోరందుకున్నాయి. మరో పది రోజుల్లో పంటల ప్రణాళిక అంచనా ప్రకారం పూర్తిస్థాయిలో వరినాట్లు వేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. కందులు, మక్కలు తదితర పంటల సాగుకు కూడా అనుకూలంగా ఉందని వ్యవసాయ అధికారులు

మిగతా 8వ పేజీలో



కొల్చారంలో ఘనపురం ఆనకట్ట కింద దమ్ము చేస్తున్న రైతు



సంగారెడ్డిలో ముసురు వేళ ఇలా ప్రయాణం



సంగారెడ్డి ఓడీఎఫ్ కాలనీలో అధ్వానంగా మారిన అంతర్గత రహదారి



రెవెన్యూ అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

కంకోల్‌లో మార్కెట్ ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టండి

రెవెన్యూ అధికారులకు మంత్రి దామోదర్ ఆదేశం

మునిపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంకోల్‌లో కూరగాయల మార్కెట్, పశువుల సంత ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు, మునిపల్లి మండలం కంకోల్ గ్రామానికి చెందిన నాయకులతో సంగారెడ్డిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంకోల్ అనగానే గుర్తొచ్చేది పశువులు, కూరగాయలు సంత అని, వాటికి స్థలం లేక ఇబ్బందిపడుతున్నామని గ్రామస్థులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. మార్కెట్ల ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కంకోల్‌లో నిర్మిస్తున్న పీహెచ్‌సీ పనులు త్వరలో పూర్తిచేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా శరత్

సంగారెడ్డి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారిగా రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్‌ను నియమిస్తూ రాష్ట్ర ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో అమలు అవుతున్న సంక్షేమపథకాలు, అభివృద్ధి పనుల్లో నిధుల వినియోగం, ప్రజలకు చేరువుతున్న తీరుపై పరిశీలన చేయనున్నారు. శరత్ గతంలో ఉమ్మడి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, సంగారెడ్డి కలెక్టర్‌గా పని చేశారు.

పురుగుల అన్నం.. నీళ్ల చారు

మూడు కిలోల పప్పు.. 240 మంది విద్యార్థులు

ఈ వార్డెన్ మాకొద్దు.. గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆందోళన



బొమ్మారెడ్డిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పుల్‌కల్, జూలై 25 ఆంధ్రజ్యోతి): 'నిత్యం పురుగుల అన్నం.. నీళ్ల చారే వడ్డిస్తున్నారు, మూడు కిలోల పప్పును 240 మంది విద్యార్థులకు సరిపెడుతున్నారు, మెనూ అమలు ఊసే లేదు, ఈ వార్డెన్ మాకొద్దు..' అని చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. మౌలిక సౌకర్యాలు కూడా లేవని గత విద్యా సంవత్సరం చివరలో నిరసన వ్యక్తంచేస్తే.. జిల్లా అధికారులు స్పందించి హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు నెరవేర్చలేదని ఆరోపించారు. కరెంటు, తాగునీరు, మరుగుదొడ్లు కూడా లేవని వాపోయారు. హాస్టల్‌లో ఒక్క రోజు కూడా మెనూ అమలు చేయడం లేదని, ఎవరికి చెప్పుకోవాలో తెలియక పస్తులుంటున్నామన్నారు.

అధికారుల విచారణ.. వార్డెన్‌పై వేటు

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న అధికారులు హుటాహుటిన తరలివచ్చారు. గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి జిల్లా అధికారి అఖిలేష్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి వసంతకుమారి, ఎంపీడీవో శంకర్ పాఠశాలను తనిఖీ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయని, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు కావడంలేదని అఖిలేష్‌రెడ్డి తెలిపారు. మౌలిక వసతులు కల్పిస్తామని, మెనూ ప్రకారం భోజనం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసతిగృహ నిర్వహణ అధ్వానంగా ఉండటం, విద్యార్థులు తినే అన్నంలో పురుగులు ఉన్నట్లు, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విచారణలో తేలడంతో ఆయన కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దీంతో, హాస్టల్ వార్డెన్‌ను శోభను సస్పెండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారని ఆయన తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కలెక్టర్ వద్దకు సర్దుబాటు పంచాయితీ

సంగారెడ్డి అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ వివాదాస్పదమవుతున్నది. జిల్లాలో 349 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ డీఈవో వెంకటేశ్వర్లు ఈ నెల 22న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ జాబితాను తప్పుల తడకగా రూపొందించారని ఆరోపణలు రావడంతో మరుసటి రోజే ఉపాధ్యాయ సంఘాల నాయకులతో డీఈవో సమావేశం నిర్వహించారు. వారి అప్పీళ్లను స్వీకరించారు. ఇదే విషయంపై శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టర్ ప్రావీణ్య, ఆదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఎంఈవోలు తప్పుడు సమాచారం ఇవ్వడంతోనే కొందరు ఉపాధ్యాయులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిందని సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో, ఎంఈవోలపై కలెక్టర్ సీరియస్ అయ్యారని తెలిసింది. క్షేత్రస్థాయి నుంచి తప్పుడు సమాచారం ఇవ్వడంతోనే సమస్య ఎదురైందని, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలిసింది.

కిట్.. ఫట్..!

జాడ లేని భూసార కేంద్రాలు..

కనిపించని కిట్లు

రసాయనాలు లేక..

మూలకు పడేశారు

ఒక్కో కేంద్రానికి రూ. లక్షకు పైనే

బూడిదలో పోసిన పన్నీరులా నిధులు

పరీక్షలు లేకుండానే

వానాకాలం సీజన్ స్టార్ట్



మెదక్ జిల్లావ్యాప్తంగా 60 క్లస్టర్లలో ఏర్పాటు చేసిన మినీ భూసార పరీక్షా కేంద్రాలు నిర్వహణ లోపంతో మూలనపడ్డాయి. 2018లో కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అభివృద్ధి చేసిన డిజిటల్ సాయిల్ ఫెర్టిలైజర్ రెకమండేషన్ టెక్నాలజీతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్కో ల్యాబ్ కోసం రూ. లక్ష వెచ్చించి రసాయనాలు, టెస్టింగ్ కిట్లను కొనుగోలు చేశారు. ఒకే ఏడాది పరీక్షలు నిర్వహించారు. ఆ తరువాత ఏడేళ్లుగా పరీక్షలే జరగడం లేదు. దీంతో, రైతులు శాస్త్రీయ పద్దతుల్లో వ్యవసాయం చేయడానికి అవకాశం లేక నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెదక్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు సమగ్ర భూసార పరీక్షలు నిర్వహించి, భూమి స్వభావానికి అనుగుణంగా పంటలు పండించడానికి అవసరమైన సూచనలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అభివృద్ధి చేసిన డిజిటల్ సాయిల్ ఫెర్టిలైజర్ రికమండేషన్ టెక్నాలజీతో 2018లో మినీ భూసార పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 60 క్లస్టర్లలో వీటిని నెలకొల్పారు. ఒక్కో ల్యాబ్ ఏర్పాటుకు రూ. లక్షకు పైగా ఖర్చు చేసి అవసరమైన కెమికల్స్, టెస్టింగ్ కిట్లను కొనుగోలు చేశారు. మట్టి పరీక్షలపై క్లస్టర్ ఏఈవోలకు శిక్షణ ఇవ్వడంతో ఏడాది పాటు వ్యవసాయ భూముల మట్టి పరీక్షలు నిర్వహించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పంటలు సాగుచేసుకున్నారు.

అటకెక్కిన పరీక్షలు

ఏడాది తర్వాత మినీ భూసార పరీక్షా కేంద్రాల్లో రసాయనాలు అయిపోయాయి. తిరిగి కొనుగోలు చేయడానికి నిధులు మంజూరు కాకపోవడం, ఇతర సమస్యల కారణంగా పరీక్షలు చేసే పరికరాలు మూలన పడిపోయాయి. కొందరు మండల వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈ పరికరాలు ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి. రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే ఈ కేంద్రాల నిర్వహణ లేకపోవడంతో రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో పంటలు సాగు చేయడానికి వీలు పడడం లేదు. లక్షలాది రూపాయల విలువైన పరికరాలను పంపిణీ చేసినా, వాటి భద్రతపై జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల అవి చెత్తబుట్టల్లోకి చేరి ఉంటాయని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

కలగానే శాస్త్రీయ వ్యవసాయం

మినీ భూసార పరీక్షా కేంద్రాలు పనిచేయకపోవడంతో వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అవలంబించే అవకాశం లేక రైతులు నష్టపోతున్నారు. మినీ భూసార కేంద్రాల్లో ఒక్క కిట్ ద్వారా రోజుకు 25 మట్టి నమూనాలను పరీక్షించవచ్చని నిపుణులు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా భూమి స్వభావం, సేంద్రీయ కార్బన్, నైట్రోజన్, భాస్వరం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్, హైడ్రోజన్, సూక్ష్మపోషకాలైన ఇనుము, బోరాన్, జింక్, రాగి, మాంగనీస్, క్లోరిన్, నికెల్ వంటి ధాతువుల శాతం తెలుసుకోవచ్చు. ప్రతి ఏటా యాసంగి పంటల అనంతరం రైతులు తమ భూముల మట్టి నమూనాలను పరీక్షించుకోవాలి. ఏడు సంవత్సరాలుగా రైతులు తమ భూముల మట్టి పరీక్షలు

మిగతా 8వ పేజీలో

అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కౌడిపల్లిలోని రైతువేదికలో శుక్రవారం కొత్త రేషన్‌కార్డులను ఎమ్మెల్యే సునీతారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డితో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో 2,508 కొత్త రేషన్‌కార్డులు జారీ చేశామని చెప్పారు. 10,500 మంది సభ్యులను కార్డుల్లో చేర్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికమని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్, జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

కొల్చారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కొల్చారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ సరైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. జిల్లాలో పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్

'నిమ్జ్'లో అంతర్గత రహదారులు, సౌకర్యాలపై దృష్టి

సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

ఝరాసంగం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'నిమ్జ్'లో అంతర్గత రహదారులు, సౌకర్యాలపై దృష్టి సారించాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని బర్దీపూర్, ఏల్గోయి, చీలపల్లి తండాల పరిధిలో నిమ్జ్ భూములను శుక్రవారం ఆమె పరిశీలించారు. భూములు, రోడ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చీలపల్లి తండాను సందర్శించి అబాదీ, గ్రామ కంఠం భూములు ఉన్నాయా అని రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తండాలో జనభా ఎంత ఉందని ఆరా తీశారు. సమస్యాత్మక భూములను వెంటనే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సేకరించిన భూముల్లో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం బర్దీపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. పాఠశాలలో మరుగుదొడ్లు, ప్రహరీ లేవని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో రాంరెడ్డి, నిమ్జ్ జీఎం బాలరాం రాథోడ్, తహసీల్దార్ తిరుమలరావు, ఆర్ఐ రామరావు తదితరులు ఉన్నారు.



నిమ్జ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్

నాడు కళకళ.. నేడు వెలవెల

- సర్కారు బడుల్లో టీచర్ల కరువు
- శిథిలావస్థకు చేరిన భవనాలు
- ప్రైవేటుకే మొగ్గుచూపుతున్న తల్లిదండ్రులు

నంగునూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన ఆ పాఠశాలలు నేడు వెలవెలబోతున్నాయి. 'ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన స్థాయి పెంచుతున్నాం' అంటూ ఉపన్యాసాలు ఇచ్చే నాయకులు, అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత మూలంగా బడిలో పిల్లలు చేరడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిద్దిపేట జిల్లాలోని పలు పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 10, ప్రాథమికోన్నత పాఠశాలలు 10, ప్రాథమిక పాఠశాలలు 18, ఒక మోడల్ స్కూల్, ఒక కస్తూర్భా గాంధీ పాఠశాల ఉంది. ప్రభుత్వ విధానాల్లో మారిన సంస్కరణ నేపథ్యంలో 11 మంది ఉన్న విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 40 మంది పైన ఉంటే ముగ్గురు, 90పైన పిల్లలు ఉన్న పాఠశాలలకు నలుగురు ఉపాధ్యాయుల చొప్పున నియమిస్తున్నారు. మండలంలోని హుస్సేన్‌నగర్ పాఠశాలలో 25 మంది విద్యార్థులకుగాను ఇద్దరు ఉపాధ్యాయులు, వెంకటాపూర్ గ్రామంలో 40 మంది విద్యార్థులకుగాను ఏడుగురు ఉపాధ్యాయులు ఉండగా, అందులో నుంచి ఒకరిని చిన్నకోడూరు మండలం మాచాపూర్, మరొకరిని జేపీ తండాకు డిప్యూటేషన్ వేశారు. 80 నుంచి 90 మంది విద్యార్థులనన ఉన్న నర్మెట్ట పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులకు గాను ఒకరిని ఖానాపూర్, మరొకరిని కొండంరాజుపల్లికి డిప్యూటేషన్ వేశారు. మండలంలోని గట్ల మల్యాల మధిర సంతోషనగర్, కోనాయిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తక్కువ ఉండడంతో ఒకే ఉపాధ్యాయురాలని కేటాయించారు. కోనాయిపల్లి పాఠశాలలో ఒకటవ తరగతిలో ముగ్గురు, రెండవ తరగతి ఐదుగురు, మూడవ తరగతిలో ఒక్కరు కూడా లేరు. నాలుగో తరగతిలో ఇద్దరు, ఐదవ తరగతిలో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు.

ప్రైవేట్‌కే మొగ్గు..

కోనాయిపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉన్నప్పటికీ సరైన ఉపాధ్యాయులు లేకపోవడంతో విధిలేని పరిస్థితిలో తల్లిదండ్రులు సిద్దిపేటలోని ప్రైవేట్ పాఠశాలకు తరలిస్తున్నారు. గ్రామంలో సుమారుగా 50 నుంచి 60 మంది ఐదవ తరగతి లోపు విద్యార్థులు ఉన్నప్పటికీ 14మంది స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా, సమీపంలోని ముండ్రాయి పాఠశాలకు 17 మంది వెళ్తున్నారు. అలాగే మిగతా విద్యార్థులు సిద్దిపేటలోని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు.

శిథిలావస్థలో మరికొన్ని పాఠశాలలు...

మండలంలోని వివిధ పాఠశాలలు శిథిలావస్థలకు చేరుకున్నాయి. ప్రధానంగా కోనాయపల్లి పాఠశాలతో పాటు రాంపూర్, మగ్దుంపూర్ పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయి. కోనాయపల్లి పాఠశాలలో రెండు గదులు మాత్రమే కొద్దిగా బాగున్నాయి. మిగతా గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్లు అధ్వానస్థితిలో ఉన్నాయి. వంటగది పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఇక్కడ పాఠశాల ఆవరణలోనే గ్రామపంచాయతీ సంబంధించి ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ వస్తువులన్నీ ఉంటాయి. విలేజ్ నర్సరీ కూడా అందులోనే ఏర్పాటు చేశారు. పిల్లలు మూత్రశాలలకు వెళ్లాలంటే చుట్టూ గడ్డి మొలిచి వెళ్లలేని పరిస్థితి ఉంది. మరుగుదొడ్డి ఉన్నప్పటికీ చుట్టూ వేపుగా గడ్డి పెరిగి అందులోకి ఎలా వెళ్లాలో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. రాంపూర్ పాఠశాల భవనాలు కూడా శిథిలావస్థకు చేరాయి. మగ్దుంపూర్ ప్రైమరీ స్కూల్లో పురాతన భవనాల్లో విద్యాబోధన జరుగుతుంది, వర్షాకాలం వస్తే వురుస్తుంది. ఇక్కడ నాలుగు భవనాలు కొత్తవి నిర్మించినప్పటికీ. గదులు సరిపోకపోవడంతో శిథిలావస్థలో ఉన్న గదులలోనే విద్యాబోధన చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్కువ పిల్లలు ఉన్న దగ్గర ప్రత్యేక ఉపాధ్యాయులను కేటాయించి విద్యార్థుల శాతాన్ని పెంచాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థలో కోనాయిపల్లిలోని పురాతన భవనాలు

ఆ టీచర్లను తొలగించొద్దు


పాఠశాల ఎదుట గ్రామస్థుల నిరసన

నిజాంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆ టీచర్లను తొలగించొద్దు.. తక్షణమే డిప్యూటేషన్ రద్దు చేయాలంటూ గ్రామస్థులు పాఠశాల ఎదుట నిరసనకు దిగారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో శుక్రవారం ప్రాథమిక పాఠశాలకు చేరుకున్న గ్రామస్థులు ప్రైవేట్‌కు తమ పిల్లలను పంపకుండా.. ఈ పాఠశాలకు పంపిస్తే చక్కగా బోధించే పంతుళ్లను వేరేచోటుకు మారుస్తారా.. అంటూ మండిపడ్డారు. పాఠశాలలో 55 మంది విద్యార్థులకుగాను నలుగురు టీచర్లు ఉండగా.. ఇటీవల ఇరువురిని మరో చోటుకు మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో సాంగినీ యాదగిరి ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌పై జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్తానని నచ్చజెప్పడంతో గ్రామస్థులు వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లులకు ఘన సత్కారం

- ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు


చేర్యాల జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులను, ఉపాధ్యాయులను సన్మానించిన గ్రామ పెద్దలు

కంది, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పేదింటి కుసుమాలు చదువుల్లో అద్భుత ప్రతిభ కనబర్చారు. తల్లిదండ్రులు కూలీనాలి చేసి చదివించినందుకు చక్కని ఫలితాలు సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రైవేటుకు దీటుగా నిలిచారు. పదో తరగతిలో సంగారెడ్డి జిల్లా టాప్-10 ర్యాంకుల్లో 4 కైవసం చేసుకున్నారు. 2024-25 చేర్యాల జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు వడ్ల గాయత్రి-588, హమీల్పూర్ ద్రిషిక-586, ఆల్ఫియా-582, అభినయ-581 మార్కులతో నలుగురు జిల్లా టాప్ టెన్ ర్యాంకుల్లో నిలిచారు. కే.పూజిత, సంజన, చంద్రిక, తేజస్విని, వర్షిణి, మైత్రి, అక్షిత, పావని, నిశాంతి 550కి పైగా మార్కులు సాధించారు. ఒకేసారి 13 మంది విద్యార్థినులు బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. విద్యార్థినులను, ఉపాధ్యాయులను గ్రామ పెద్దలు చేవెళ్ల వెంకట్‌రెడ్డి ఘనంగా సన్మానించి జ్ఞాపికలు, చదువుల ఖర్చులకు కొంత నగదు అందజేశారు. తమ గ్రామంలో 13 మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందడం తమకు గర్వకారణమన్నారు. తమ విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్‌నాయక్, వెంకట్‌రెడ్డి, ఇంద్రకరణ్ ఎస్సై విజయ్‌కుమార్ గౌడ్, సొసైటీ డైరెక్టర్ వసంత్‌రెడ్డి, హెచ్ఎం రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

- సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని గోవర్ధనగిరి, వర్ధరాజ్‌పల్లి, లింగంపేట, ముత్యంపేట, గుడికందుల పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజన తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో రుచికరమైన భోజనం పెడుతున్నారా, విద్యాబోధన ఎలా ఉందని ఆరాతీశారు. బేస్‌లైన్ పరీక్ష నిర్వహించారా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా గుడికందుల పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఎంఈవో నర్సయ్య, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, సీఆర్‌పీ వెంకటస్వామి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రీమ్‌వెల్లీ కాలనీలో కుక్కల బెడద

- కుక్కకాటుతో పలువురికి గాయాలు

జహీరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో క్కుకల బెడద అధికమైంది. ఏవార్డులో చూసినా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దారిగుండా వెళ్తున్న వారిని వెంబడిస్తూ కరుస్తున్నాయి. ప్రతినెల 10 వరకు కుక్కకాటుకు సంబంధించిన కేసులు వస్తున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శ్రీధర్ తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని డ్రీమ్‌వెల్లీ కాలనికి చెందిన నిఖిత(8)తోపాటు పలువురు కుక్కకాటుకు గురయ్యారు. ఎక్కువ గాయాలకు గురైన నిఖితను పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం నిమిత్తం సంగారెడ్డికి తరలించారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇటుక బట్టీలపై అధికారుల దాడులు

- మూడు ట్రాక్టర్లకు చలాన్ల విధింపు

చిన్నశంకరంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై మైనింగ్‌శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మండలంలోని గవ్వపల్లి, అంబాజీపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల నుంచి ట్రాక్టర్లతో పలు గ్రామాలకు అధికారుల అనుమతులు లేకుండా ఇటుకను సరఫరా చేస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు జిల్లా మైనింగ్‌శాఖ ఆర్ఐ లక్ష్మీనారాయణ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని పోలీసస్టేషన్ సమీపంలో మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. గవ్వపల్లికితండాకు చెందిన కత్రోత్ పంతుల్యా ట్రాక్టర్‌కు రూ.20 వేలు, అంబాజీపేటకు చెందిన బాబాగౌడ్ రెండు ట్రాక్టర్లకు కలిపి రూ.40 వేలు, మొత్తం రూ.60 వేల చలాన్ విధించారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్‌శాఖ ఆర్ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అసిస్టెంట్ మలేరియా అధికారిగా కాత్రోత్ చందర్

మెదక్, కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారిగా కాత్రోత్ చందర్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం నియామకపత్రాన్ని అందజేశారు. చందర్ పాపన్నపేట మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తూ, శుక్రవారం అసిస్టెంట్ మలేరియా అధికారిగా నియమితులయ్యారు. కార్యక్రమంలో హరిప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్ట్

మునిపల్లి, జులై 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం మునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 1.250 గ్రాముల ఎండు గంజాయి, రూ.9,500 నగదు, కారు, బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కొండాపూర్ ఎస్సై సోమేశ్వరీ, మునిపల్లి ఏఎస్సై బక్కన్న కేసు వివరాలను వెల్లడించారు. రాయికోడ్ మండలం నాగన్‌పల్లికి చెందిన వడ్డె నర్సింహులు, కొండాపూర్ మండలం గారకూర్తికు చెందిన వెంకట్‌రెడ్డి బీదర్‌లోని ఇరానీగల్లీ నుంచి ఎండు గంజాయిని కొనుగోలు చేసి, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు కంకోల్ టోల్ ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కారు, బైక్‌లపై అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా, 1,250 గ్రాముల ఎండు గంజాయి లభించింది. ఈ మేరకు నిందితుల నుంచి గంజాయితో పాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని, వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో కొండాపూర్ ఎస్సై సోమేశ్వరీ, మునిపల్లి ఏఎస్సై బక్కన్నతో పాటు పోలీసు సిబ్బంది హనీఫ్, పాండు, ఆనంద్, సంతోష్, డ్రైవర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.


పట్టుబడిన ఎండు గంజాయి

గంజాయి కేసులో యువకుడి అరెస్ట్

చేర్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయానికి యత్నించిన పట్టణానికి చెందిన పచ్చిమడ్ల రామును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన రాము 9వ తరగతి వరకు చదువుకున్నాడు. ఉపాధి నిమిత్తం పట్టణ శివారులోని ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేశాడు. కానీ కొంతకాలం క్రితం పని మానేసిన క్రమంలో గంజాయి సేవనానికి అలవాటుపడ్డాడు. డబ్బుల కోసం గంజాయి విక్రయానికి అడుగులు వేశాడు. ఈక్రమంలో ఇటీవల హైదరాబాద్‌లోని అన్నసాగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయానికి ప్రయత్నిస్తున్న క్రమంలో స్థానిక అయ్యప్ప కాలనీ సమీపంలో టాస్క్‌ఫోర్స్, పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి నుంచి 122 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. కాగా తమ పిల్లల ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి విక్రయించినా, సేవించినా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఇందులో చేర్యాల ఎస్ఐ నవీన్, సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్

బాల కార్మికులతో పనిచేయిస్తున్న ఇద్దరిపై కేసు

నర్సాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మికులతో పనిచేయిస్తున్న ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లింగం తెలిపారు. శుక్రవారం అసిస్టెంట్ లేబర్ అధికారి నేతృత్వంలో పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ మార్గంలోని ఓ బట్టల దుకాణంలో 17 ఏళ్ల బాలుడు, బస్టాండ్ సమీపంలోని ఓ పూల దుకాణంలో 16 ఏళ్ల బాలుడు పనిచేస్తున్నట్లు గుర్తించి సదరు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత


చెర్లఅంకిరెడ్డిపల్లి శివారులో లారీని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

చిన్నకోడూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ లారీని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సైఫ్‌అలీ వివరాల ప్రకారం.. అనుమతి లేకుండా గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు లారీలో ఇసుక తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో శుక్రవారం తెల్లవారుజామున సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు కలిసి మండలంలోని చెర్లఅంకిరెడ్డిపల్లి స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై తనిఖీ చేసి పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కళాశాలకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యం


లావణ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కళాశాలకు వెళ్లి విద్యార్థిని అదృశ్యమైన సంఘటన గజ్వేల్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. మేడ్చల్ జిల్లా కాప్రా మండలం జవహర్‌నగర్‌లోని అరుంధతినగర్‌కు చెందిన కాలల్ లావణ్య(21) గజ్వేల్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ బాలికల హబ్‌లో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోంది. 24న కళాశాలకు వెళ్లిన లావణ్య సాయంత్రం హాస్టల్‌కు తిరిగి రాలేదు. హాస్టల్ వార్డెన్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు బంధువుల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. లావణ్య తండ్రి మల్లికార్జున్ మేడ్చల్ జిల్లా బాలాజీనగర్‌కు చెందిన విష్ణుపై అనుమానం వ్యక్తం చేస్తూ గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

చేర్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన పొన్నబోయిన ప్రభాకర్‌కు చెందిన పాడి గేదె రోజులాగే శుక్రవారం వ్యవసాయ బావి వద్ద గడ్డి మేస్తున్నది. ఈ క్రమంలో పరిసరాల్లోనే విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తగిలి మృతిచెందింది. సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభాకర్ వేడుకుంటున్నాడు.

ఉద్యోగులు సంఘటితం కావాలి

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

మెదక్ అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు సమస్యల సాధన కోసం సంఘటితం కావాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన సహకార శాఖ ఉద్యోగుల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ వ్యవస్థ ప్రమాదంలో ఉందని, నిర్వీర్యం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఉద్యోగిపై ఉందన్నారు. అంతకుముందు సహకార శాఖ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా సహకార శాఖ ఉద్యోగులకు పెద్దఎత్తున పదోన్నతులు కల్పించామన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సహకారశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామాగౌడ్, కార్యదర్శిగా సంగమేశ్వర్, కోశాధికారిగా యాకూబ్ అలీతో పాటు పలువురిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, వివిధ యూనిట్ అధ్యక్షులు, ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్‌కు ప్రపంచ దేశాల ప్రశంసలు

● ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్‌రమేశ్ సిరియాల్



మాట్లాడుతున్న ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రమేశ్ సిరియాల్

సంగారెడ్డి అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సింధూర్‌ను ప్రపంచ దేశాలు ప్రశంసించాయని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్‌రమేశ్ సిరియాల్ అన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో భారత సైన్యం విజయవంతంగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత వైమానిక, నౌకా దళాలు సంయుక్తంగా పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపి ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేశాయని గుర్తుచేశారు. భవిష్యత్‌లో ఎటువంటి ఉగ్రవాద చర్యలు భారతదేశంలో కొనసాగించినా ప్రతిఫలంగా చర్యలు తీసుకుంటుందని ప్రపంచ దేశాలకు భారత్ చాటి చెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్, ఎన్‌సీసీ అధికారి విజయ, వైస్ ప్రిన్సిపాల్ నిర్మల, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సంగారెడ్డి



జోగిపేట ఏరియా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ సంగారెడ్డి

జోగిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున వైద్యులు, సిబ్బంది అందరూ విధిగా హాజరు కావాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ సంగారెడ్డి ఆదేశించారు. ఒకవేళ ఎవరైనా విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలం వ్యాధులు సోకే సీజన్ కావడంతో అనుక్షణం అప్రతమత్తంగా ఉండాలన్నారు. డాక్టర్లు సమయపాలన పాటించాలని, సిబ్బంది వైద్యసేవలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇన్‌పేషెంట్లుగా ఆస్పత్రిలో చేరిన రోగులకు సమయానికి మెనూ ప్రకారం డైట్ ఫుడ్, పాలు, ఇడ్లీ, బ్రెడ్, పండ్లతో పాటు ప్రభుత్వం అందజేసే పోషకాహారాలను రోగులకు రోజూ అందజేయాలన్నారు. కాగా ఆస్పత్రికి వచ్చిన సంగారెడ్డి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య, ఆర్‌ఎంవో డాక్టర్ అశోక్‌తో కలిసి ప్రతీ వార్డులో కలియతిరిగారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి ఆరాతీశారు. మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని రోగులు చెప్పడంతో వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

రాచన్నస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న భక్తులు

కోహీర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల రాచన్నస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణ మాసం పురస్కరించుకుని ఆలయంలో స్వామివారికి భక్తులు లక్ష బిల్వార్చన చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ శ్రావణమాసం ముగింపు వరకు ఆలయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహిస్తామని ఈవో శివరుద్రప్ప తెలిపారు.

వర్టికల్ విభాగాల్లో ప్రతిభ చూపాలి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

మునిపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వర్టికల్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిపేందుకు పోలీసు శాఖ కృషి చేయాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. మండల పరిధిలోని బుదేరా చౌరస్తా పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు అన్ని రకాల విధులను తెలుసుకుని ఉండాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎలాంటి విధులలైనా.. చేయగలిగే విధంగా పరిజ్ఞానం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో హిస్టరీ షీట్లు, పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రమాద అంచున ఉన్న చెరువులు, కుంటల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ వెంట స్టేషన్ ఇన్‌చార్జి, ఏఎస్‌ఐ బక్కన్న, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.



చిన్నకోడూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ (ఫైల్)

వర్షాకాలం.. జర పైలం

- పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- రైతులు, మూగజీవాలకు ముప్పు
- అప్రమత్తతతోనే రక్షణ అంటున్న అధికారులు

చిన్నకోడూరు/వెల్దుర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అసలే వర్షాకాలం ఇంటా.. బయట విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. గాలివానకు విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ వైర్లు తెగిపడడం వంటివి జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాల బారినపడకుండా ఉంటారని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాలకు కారణాలు

● గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యన, జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ఉండి వాటికి చుట్టూ కంచె లేకపోవడం



వెల్దుర్తిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేపడుతున్న విద్యుత్ శాఖ సిబ్బంది

● గ్రామాల్లో ఇళ్ల పైనుంచి ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉండటం

● వ్యవసాయ బావుల వద్ద పంట పొలాల్లో చేతికందే ఎత్తులో, కర్రలపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉండటం

● వర్షాకాలంలో ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటం వల్ల, విద్యుత్ స్తంభాలు ఒకవైపు వంగడం, విరిగిపోవడం వంటివి జరిగి ప్రమాదాలకు కారణమవుతాయి. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్న తీరు

● ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ వైర్లు మార్చడం, చిన్న చిన్న మరమ్మతులు చేస్తున్నప్పుడు విద్యుత్ సరఫరా అయి విద్యుత్‌షాక్‌కు గురికావడం

● వర్షాకాలంలో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, తీగలు తెగిపడడంతో ప్రమాదాలు జరగడం

● వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాలోకి ఉండే కనెక్షన్‌కు సరైన వైరింగ్ లేకపోవడం వల్ల ఏమరపాటుతో ప్రమాదాలు సంభవించటం

● స్టార్టర్ డబ్బా నుంచి బోరు, బావి మోటార్లకు వెళ్లే విద్యుత్ వైరు కనెక్షన్ పొదల్లో ఉండి గడ్డి కోస్తున్నప్పుడు ప్రమాదాలు జరగటం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● విద్యుత్ స్తంభాలను, తెగిపడిన విద్యుత్ తీగలను తాకొద్దు.

● తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లను, పరికరాలను ముట్టుకోవద్దు.

● పశువులను విద్యుత్ స్తంభాలకు, సమీపంలో కానీ కట్టి వేయొద్దు.

● పంట పొలాల వద్ద బావి, బోరు మోటార్లు వాడేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

● విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సొంతంగా మరమ్మతులు చేయొద్దు.

● నాణ్యమైన స్టార్టర్ డబ్బాలు, సర్వీసు వైరు వాడాలి.

● విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాలోకి, అదేవిధంగా స్టార్టర్ డబ్బా నుంచి బోరు, బావి మోటార్లకు వెళ్లే విద్యుత్ కనెక్షన్‌కు సరైన వైరింగ్ ఉండేటట్లు చూసుకోవాలి.

● ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే సమయంలో ఇంట్లోని టీవీ, కంప్యూటర్, ఫ్రిడ్జ్ వంటివి ఆఫ్ చేయాలి.

సొంతంగా మరమ్మతులు వద్దు



విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామాల్లో, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సమస్యలు ఏర్పడితే సొంతంగా మరమ్మతులు చేయకూడదు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

- చాంద్‌పాషా, విద్యుత్‌శాఖ ఏఈ, చిన్నకోడూరు సెక్షన్

విద్యుత్ సమస్య వస్తే చెప్పాలి



గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ సమస్య వస్తే వెంటనే 8712473367కు సమాచారం అందించాలి. రైతులు పంట పొలాలు, బోరు బావుల వద్ద మోటార్లను, స్టార్టర్లను తడి చేతితో ముట్టుకోవద్దు. ఇంట్లో చిన్నపిల్లలను కరెంట్ వస్తువుల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలి. స్తంభం నుంచి ఇళ్లకు వచ్చే విద్యుత్ సర్వీస్ వైర్ దెబ్బతింటే వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలపాలి. విద్యుత్ సమస్యలు వస్తే సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దు.

- పెంట్యానాయక్, వెల్దుర్తి, విద్యుత్‌శాఖ ఏఈ, వెల్దుర్తి

మూగజీవాల పరిహారం అందేదెప్పుడో..?

● పిడుగుపాటుకు పశువుల మృత్యువాత ● పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు



మృత్యువాతపడిన ఎద్దు వద్ద రోదిస్తున్న రైతు

దౌల్తాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలతో పాటు పిడుగుపాటుకు పొలాల, బోరుబావుల వద్ద కట్టేసిన పశువులు మృత్యువాతపడ్డాయి. అయితే బాధిత రైతులు పరిహారం కోసం రెండేళ్లుగా సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లి, దొమ్మాట, తిర్మలాపూర్, గోవిందాపూర్ తదితర గ్రామాల్లో రెండేళ్లలో పిడుగుపాటుకు దాదాపు 20 పశువులు మృత్యువాతపడ్డాయి. ఒక్కో మూగజీవానికి రూ.50 వేలపైనే ఉంటుంది. ఈ లెక్కన మండలవ్యాప్తంగా ఆయా గ్రామాల్లో 20 పశువులకు దాదాపు రూ.10 లక్షలపైనే పరిహారం రావాల్సి ఉన్నది. బాధిత రైతులు పరిహారం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని మృత్యువాతపడ్డ పశువులకు పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ వేధింపులు భరించలేకే చేరుతున్నారు..



హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న మడూర్ సొసైటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు

చిన్నశంకరంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో వేధింపులు భరించలేకే కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసంలో చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ సొసైటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు బీమరి యాదగిరి, డైరెక్టర్లు విఠల్‌నాయక్, శ్రీశైలంతోపాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ ఉండేదని, మోసపూరిత మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ప్రజలు సంతోషంగా లేరన్నారు. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘనవిజయం సాధిస్తుందన్నారు. కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు కుమార్ గౌడ్, శారథ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే అంటువ్యాధులు దూరం

- పారిశుధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక నజర్
- అందుకే 100 రోజుల ప్రణాళిక
- బల్దియా కమిషనర్ ఏ.రవీందర్



పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్ రవీందర్

జోగిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులు సోకకుండా జాగ్రత్త పడొచ్చని అందోలు-జోగిపేట మున్సిపల్ కమిషనర్ ఏ.రవీందర్ అన్నారు. శుక్రవారం బల్దియాలోని 14, 18 వార్డుల్లో కొనసాగుతున్న 100 రోజుల పారిశుధ్య ప్రణాళికను ఆయన తనిఖీ చేశారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగానే పారిశుధ్యంపై 100 రోజుల ప్రణాళికను రూపొందించి ప్రతి వార్డులోనూ పారిశుధ్య పనులను ముమ్మరంగా, యుద్ధప్రాతిపదికన చేపడుతోందన్నారు. ఎక్కడా మురుగునీరు నిలువకుండా, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరగకుండా పారిశుధ్య పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆయా వార్డుల్లో దోమలు వృద్ధి చెందకుండా దోమల నివారణ మందులను పిచికారీ చేస్తున్నామన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను మురుగు కాలువల్లో, ఇంటి బయట పారేయకుండా చెత్త బండ్లకు అందజేయాలని చెప్పారు. ఇదిలా ఉంటే, ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ప్రజా టాయిలెట్లను తనిఖీ చేసి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, సిబ్బంది ఉన్నారు.

కొత్తపల్లి సొసైటీ సేవలు అమోఘం

● నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయభాస్కర్



కొత్తపల్లి సొసైటీలో నాబార్డ్ చీఫ్ సీజీఎం ఉదయభాస్కర్, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

పాపన్నపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం చేస్తున్న సేవలు అమోఘమని నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపల్లి సొసైటీని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ టి. రమేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాస్కర్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి గాను సొసైటీ లాభాల్లో కొంతమేర షేర్లను రైతులకు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ ఏడాది కూడా పది శాతం లాభాన్ని రైతులకు ఇవ్వనుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

సంగారెడ్డి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డా.నాగనిర్మల



డా.నాగనిర్మల

సంగారెడ్డి అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ కె.నాగనిర్మల నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ బి.రవీందర్‌నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ నాగ నిర్మల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిప్యూటీ సివిల్ సర్జన్ హోదాలో పీవో ఎంసీహెచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు కోహీర్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ గాయత్రీదేవీని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో బాధ్యతల నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. డాక్టర్ నాగనిర్మలకు తక్షణమే పూర్తి బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆకస్మాత్తుగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీని ఆ బాధ్యతల నుంచి తప్పించడంతో వైద్య ఆరోగ్య శాఖ వర్గాల్లో సర్వత్రా చర్చ నెలకొన్నది.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య



బండారి మహేశ్ (ఫైల్)

తొగుట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా తొగుటలో శుక్రవారం చోటుచేసుకున్నది. గ్రామస్థుల, కుటుంబీలకు కథనం ప్రకారం.... గ్రామానికి చెందిన బండారు మహేశ్(34)కు భార్య లత, ఇద్దరు కూతుళ్లు ప్రవల్లిక(8), మనుదీపిక(6), తల్లి ఎల్లవ్వ ఉన్నారు. మహేశ్ గ్రామంలో హమాలీ పనిచేయడంతో పాటు తనకున్న 15 గుంటల వ్యవసాయ భూమిలో పంట సాగుచేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని అప్పుచేసి నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాడు. మిగతా భూమిలో వరినాట్లు వేయడానికి దుక్కిని సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే అతడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. ఇళ్ల నిర్మాణానికి డబ్బు లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కుటుంబ పోషణ ఒకవైపు, అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఈనెల 22న మధ్యాహ్నం గడ్డి మందుతాగాడు. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన అతడిని చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతడిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రహించి మెరుగైన చికిత్స కోసం అదేరోజు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మహేశ్ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మహేశ్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. తండ్రి శవంపై పడి అతడి పిల్లలు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడి అన్న నాగరాజు ఫిర్యాదు మేరకు తొగుట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

● ముగ్గురిపై కేసు

తూప్రాన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేలుడు పదార్థాలు ఉపయోగిస్తూ అక్రమంగా పేలుళ్లకు పాల్పడుతున్న కాంప్రెషర్ ట్రాక్టర్, పేలుడు పదార్థాలు తుప్రాన్ పోలీసులు పట్టుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్సై శివానందం కథనం ప్రకారం.. గుండ్రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధి గౌడిగూడెం శివారులోని రాంచంద్రారెడ్డి వ్యవసాయ భూమిలో అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలతో బండరాళ్లను పేలుస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అక్కడ పేలుళ్లకు పాల్పడుతున్న బిక్షపతి, బొల్లబోయిన నర్సింలు, అంబపురం రాజును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పేలుడు పదార్థాలు, కాంప్రెషర్ ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు.

న్యూస్ బాక్స్

28 లోగా ఓపెన్ స్కూల్ ఫీజు చెల్లించాలి

సంగారెడ్డి అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్ పొంది సెప్టెంబరులో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్న అభ్యాసకులు ఈ నెల 28వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలకు 8008403635 నంబరు సంప్రదించాలని ఆయన కోరారు.

సొంత నిధులతో కళాశాలలకు ఆర్‌వో ప్లాంట్లు

నర్సాపూర్/కొల్చారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కొల్చారం పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు, నర్సాపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. నర్సాపూర్, కొల్చారం లోని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు తాగునీటి సమస్య ఉండటంతో తన సొంత ఖర్చులతో విద్యార్థులకు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు రాజిరెడ్డి తెలిపారు అనంతరం కొల్చారం మండలంలో నాలుగు లక్షల నలభై ఎనిమిది వేల విలువ చేస్తే సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మెదక్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు

ఖేడ్‌లో ప్రారంభమైన బీఆర్ఎస్‌వీ బనకచర్ల జంగ్ సైరన్

నారాయణఖేడ్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రిష్ణా, గోదావరి నదుల అనుసంధానంతో చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా శుక్రవారం నారాయణఖేడ్‌లో బీఆర్ఎస్‌వీ బనకచర్ల జంగ్ సైరన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా బీఆర్ఎస్‌వీ కోఆర్డినేటర్ రాజేందర్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షులు అంజాగౌడ్‌లు మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంను నిబంధనలకు విరుద్ధంగా చేపడుతుందని, దీంతో తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అందువల్ల బీఆర్ఎస్‌వీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జంగ్‌సైరన్‌ను ఉధృతం చేస్తామన్నారు.

ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

మెదక్ కల్చరల్/అల్లాదుర్గం జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంచి మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో దివ్యాంగుల అనుబంధ సంఘాలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు దండు శంకర్, వీహెచ్‌పీఎస్ కోఆర్డినేటర్లు మాట్లాడుతూ అన్ని వర్గాల దివ్యాంగులకు ప్రభుత్వం తక్షణమే పింఛన్‌ను పెంచాలన్నారు.

● వట్‌పల్లి, జూలై25(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కోటా కింద వచ్చే ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఎన్‌డీపీఆర్ దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్ ఆధ్వర్యంలో ఎంపీ డీవో అంజయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు

పొగాకుతో ఆరోగ్యం పాడుచేసుకోవద్దు

చిన్నశంకరంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పొగాకు చుట్టాతో ప్రజలు ఆరోగ్యాలు పాడుచేసుకోవద్దని ఎంఈవో పుష్పవేణి అన్నారు, అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని మిర్జాపల్లి హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

కొత్త మున్సిపాలిటీ మురిపెం మూన్నాళ్ల ముచ్చటేనా?

- కోహీర్‌లో పనిచేయలేక బదిలీల బాట పడుతున్న కమిషనర్లు
- 58 రోజులుగా కొత్త కమిషనర్ జాడే లేదు
- ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం
- ఎక్కడికక్కడే పేరుకుపోతున్న సమస్యలు
- అయోమయంలో పట్టణ ప్రజలు



కోహీర్ మున్సిపల్ కార్యాలయం

కోహీర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కోహీర్ కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటైందని సంతోషించాలో.. లేక పనులు కావడం లేదని బాధపడాలో తెలియని పరిస్థితుల్లో స్థానికులు కొట్టుమిట్టాడుతున్నారు. మున్సిపాలిటీలో జనన, మరణ ధ్రువపత్రాలు జారీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో కోహీర్ పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వివరాల్లోకి వెళ్తే..

పేరుకుపోతున్న సమస్యలు

కోహీర్ ప్రజల కోరిక మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో కోహీర్ పట్టణాన్ని కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. అయితే పట్టణ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం సంతోషించదగిన పరిణామమే అయినప్పటికీ, మున్సిపల్‌లో అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం నియమించకపోవడంతో పట్టణవాసుల సమస్యలు తీవ్రమయ్యాయి. కనీసం ప్రజలకు, విద్యార్థులకు అత్యవసరమైన జనన, మరణ ధ్రువపత్రాలు కూడా జారీ చేయడం లేదంటే మున్సిపాలిటీగా చేసి ప్రయోజనమేంటని పలువురు విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీగా మారితే అన్ని సక్రమంగా సాగుతాయని భావించిన కోహీర్ ప్రజలకు నిరాశే ఎదురైంది. కోహీర్ పట్టణాన్ని మున్సిపాలిటీగా మార్చారే తప్ప పట్టణంలో ఏ ఒక్క సమస్య పరిష్కారం కావడం లేదు. మున్సిపల్ సిబ్బందిని నియమించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయి పాలనపై అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

ఇలా వచ్చి.. అలా వెళ్తున్నారు..

కోహీర్‌లో సమస్యలు అధికంగా ఉండడం వల్ల ఏ ఒక్క మున్సిపల్ కమిషనర్ కూడా పట్టుమని 10 నెలలు కూడా విధులు నిర్వహించకుండానే పైరవీలు చేసుకుని బదిలీలపై వెళ్తున్నారు. జనవరిలో కోహీర్‌ను మున్సిపాలిటీగా మార్చిన అనంతరం జహీరాబాద్ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఉమామహేశ్వరరావుకు అదనపు బాధ్యతల కింద కోహీర్ మున్సిపాలిటీని అప్పగించారు. కొద్ది రోజులకే ఆయన బదిలీ కావడంతో వెంకట్‌రెడ్డి అనే మరో కమిషనర్‌ను కోహీర్‌కు నియమించారు. కోహీర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం వెంకట్‌రెడ్డికి తలకుమించిన భారం కావడంతో ఆయన బదిలీపై మరో చోటుకు వెళ్లారు. దీంతో కోహీర్‌కు రమేష్ అనే మరో కమిషనర్‌ను నియమించారు. ఆయన కూడా కొన్ని నెలలే విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లారు. అనంతరం ప్రకాష్ అనే మరో కమిషనర్ నియమించారు. ఆయన కూడా ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు.

దాదాపు రెండు నెలలుగా కమిషనర్ లేక..

రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఏ కమిషనర్ కోహీర్‌కు రావడం లేదు. దీంతో ఆన్‌లైన్ ద్వారా జారీ చేసే ఏ ఒక్క ధ్రువ పత్రం కూడా జారీ కావడం లేదు. కోహీర్ పట్టణ ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నారు ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కోహీర్ మున్సిపాలిటీలో నెలకొన్నన సమస్యల పరిష్కారం కోసం కమిషనర్ నియమించి పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నాను.

గెలుపే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు పనిచేయాలి


మనోహరాబాద్: సమావేశంలో పాల్గొన్న సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్


మొగుడంపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రభారీ చంద్రశేఖర్

తూప్రాన్/మనోహరాబాద్/చేగుంట/అల్లాదుర్గం, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌లో, మనోహరాబాద్ మండల కేంద్రంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సంధర్బంగా మండల స్థాయి కార్యశాల సమావేశాలను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తూప్రాన్, మనోహరాబాద్ మండల అధ్యక్షులు పిట్ల పోచయ్య, వెంకటేష్‌గౌడ్‌లో అధ్యక్షతన సమావేశాలు నిర్వహించగా అసెంబ్లీ ఎన్నికలు లక్ష్యంగా పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయాలని కార్యకర్తలకు బైరిశంకర్ దిశా నిర్దేశం చేశారు. చేగుంట ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి బీజేపీ మెదక్, సిద్దిపేట జిల్లాల అధ్యక్షులు మల్లేశం గౌడ్, బైరి శంకర్ ముదిరాజ్ హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, మోదీ సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. చేగుంటలో రైల్వే ఆర్‌వో బ్రిడ్జికి రూ. 45 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు గాంధీ చౌరస్తా వద్ద ప్రధాని మోదీ, రైల్వే మంత్రి, ఎంపీ రఘునందన్ రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అల్లాదుర్గంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయుటకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు.

● **జహీరాబాద్/కోహీర్:** త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగ కార్యకర్తలు,నాయకులు కృషిచేయాలని మొగుడంపల్లి ప్రభారీ చంద్రశేఖర్, జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్‌లు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మొగుడంపల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో మండలస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కోహీర్ మండలం దిగ్వాల్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశంలో కోహీర్ మండల అధ్యక్షుడు వైద్యనాథ్ మాట్లాడారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కొరకు ప్రతి బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు.

సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యం: ఖేడ్ ఎమ్మెల్యే


నాగల్‌గిద్దలో నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

నాగల్‌గిద్ద/మనూరు/నారాయణఖేడ్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం నాగల్‌గిద్ద మండల కేంద్రంలో గల రైతు వేదికలో మండలానికి మంజూరైన నూతన రేషన్ కార్డులను సుమారు 30 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శివక్రిష్ణ, ఎంపీడీవో మహేశ్వర్‌రావు మండల పార్టీ అధ్యక్షుడు మాణిక్‌రావుపటేల్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎస్కే గ్రామంలో గ్రామ స్వరాజ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా కుట్టు మిషన్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సక్రునాయక్ తండాలో మొదటి దశ ఇందిరమ్మ బిల్లుల పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా మనూరులోని రైతు వేదికలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుసాగర్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన పల్నాటి ప్రశాంత్‌కు సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు రూ. 19వేల విలువైన చెక్కును శుక్రవారం స్వగృహంలో సంజీవరెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ప్రయోజనం

జహీరాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నిరుపేదల ప్రయోజనార్థం ప్రభుత్వం అందజేస్తున్న సీఎం సహాయనిధి పథకం నిరుపేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటిమాణిక్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఝరాసంగం, తదితర మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.5.11లక్షలు విలువచేసే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జహీరాబాద్, ఝరాసంగం మండలాలకు చెందిన పార్టీఅధ్యక్షులు తట్టునారాయణ, వెంకటేశం, కార్యకర్తలు లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

● ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

కొల్చారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొల్చారం రైతు వేదికలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు, రైతులకు రూ.2లక్షల రుణామాఫీ తదితర హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. గ్యాస్ సబ్సిడీ అర్హులైన వారికి డబ్బులు జమ కావడం లేదని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ రేషన్ కార్డు ఉండడం వల్ల ప్రభుత్వ నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు నియోజకవర్గంలో 2508, జిల్లాలో 10500, కొల్చారం మండలంలో 1,772 మందికి కొత్త రేషన్ కార్డు మంజూరైనట్టు జరిగింది తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మైపాల్ రెడ్డి తహసీల్దార్ శ్రీనివాస్ చారి డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్‌తో పాటు అధికారులు మాజీ ప్రజాప్రతినిధులు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి


పాపన్నపేట: గాంధారి పల్లిలో ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

చేగుంట/పాపన్నపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాటిన ప్రతి మొక్కనూ కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తూప్రాన్ రేంజ్ ఆఫీసర్ అంబర్‌సింగ్ పేర్కొన్నారు. చేగుంట మండలం వడియారం రిజర్వ్ ఫారెస్ట్‌లో శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. వన మహోత్సవ కార్యక్రమంలో అధికారులు విద్యార్థులతో కలిసి 100మొక్కలు నాటారు. కార్యక్రమంలో తూప్రాన్ లిఫ్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి, ఎంపీడీవో చిన్నారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని గాంధారిపల్లిలో ఎక్సైజ్ అధికారులు ఈత మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ నాగేశ్వరరావు, గీత కార్మికులు పాల్గొన్నారు.

● **జిన్నారం/జహీరాబాద్:** జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలో ఎవెన్యూ ప్లాంటేషన్, సీజనల్ వ్యాధుల నివారణ అవగాహన నిర్వహించారు. శుక్రవారం కమిషనర్ వెంకటరామయ్య, డిప్యూటీ ఈఈ నర్సింహరాజు, ఆర్వో మధుసూదన్‌రెడ్డితో కలిసి పారిశ్రామిక రహదారి, చౌదరిగూడెంలో మొక్కలు నాటారు. జహీరాబాద్‌లోని డిగ్రీకళాశాల ఆవరణలో మొక్కలనునాటారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ అస్లాంఫారూఖీ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


నర్సాపూర్ ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్‌వో

నర్సాపూర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశమున్నందున ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా డీసీహెచ్‌వో డాక్టర్ శివదయాల్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిని సందర్శించి రికార్డులు, రిజిస్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి సీజనల్ వ్యాధులు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలతో పాటు అందుబాటులో ఉంచుకోవాల్సిన మందులు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ పావనితో పాటు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

● మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి

నర్సాపూర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలు తమ ఇళ్ల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు సిబ్బందితో రోడ్లు, వీధులను శుభ్రంగా ఉండేలా చూస్తున్నామని, దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు జాగ్రతలు తీసుకోవాలని చెత్తను రోడ్డుపై ఇష్టానుసారంగా వేయకుండా చెత్త సేకరించే వాహనాలలోనే వేసి మున్సిపల్ వారికి సహకరించాలని ఆయన సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామాయంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ ప్రజలకు సూచించారు. డ్రైడే- ఫ్రైడేలో భాగంగా ఆయన శుక్రవారం మండల పరిధిలోని సుతార్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు.పలు వీధుల్లో తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.వెంట మండల వైద్యాధికారిని హరిప్రియ వైద్య సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ


సదాశివపేట 9వ వార్డులో ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న మునిపల్లి సత్యనారాయణ తదితరులు

సదాశివపేట, జూలై 25: (ఆంధ్రజ్యోతి): పేదలకు సొంతింటి సౌకర్యం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలో 240 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు హౌసింగ్ డీఈఈ మాధవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జె.ఉమా, మునిపల్లి సత్యనారాయణ భూమిపూజలు నిర్వహించి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మునిపల్లి సత్యనారాయణ మాట్లాడారు. జిల్లా మంత్రులు దామోదర్ రాజనరసింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి నాయకత్వంలో సదాశివపేట పట్టణం, మండలంలో ఇళ్లు లేని పేదలకు సొంత ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. డ్వాక్రా గ్రూపు మహిళలకు ముందుగా ఇంటి నిర్మాణానికి రూ.1లక్ష అందిస్తున్నట్టు తెలిపారు.

సంక్షేమాల పర్యవేక్షణే అధికారుల విధి

కొండాపూర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించి అవకతవకాలు జరుగకుండా చూడడమే పరివేక్షిస్తూ అధికారుల విధిగా పర్యటన కొనసాగిస్తున్నామని ఎంపీడీవో సత్తయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి గ్రామంలో ఎంపీడీవో సత్తయ్య పరివేక్షించి పలు అభివృద్ధి. సంక్షేమా,అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాపు పనులు, ఓటరు జాబితా, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న సేవలు, పాఠశాల మధ్యాహ్న భోజనం, నర్సరీలో పెంచుతున్న మొక్కలను సందర్శించారు. వెంట జీపీ సెక్రటరీ నవీన్, బీఎల్‌వో శ్రీలత, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు

మల్చింగ్ విధానంతో దిగుబడి ఎక్కువ

కొండాపూర్,జూలై 25(ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్ ఫాం సాగు చేపడంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి లభిస్తుందన్ని ఉద్యాన శాఖ అధికారి శైలజ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గుంతపల్లిలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించి మాట్లాడారు. అంతర్‌పంటల సాగు ఎరువుల వాడకంపై యాజమాన్యంపై అవగాహన కల్పించారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి


పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. సంగారెడ్డి పట్టణం కల్పకుంటలోని మహాత్మాజ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వంటశాలను తనిఖీ చేసి, వంటలను రుచి చూశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం పిల్లలు తాగే నీరు, ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.

గణేష్‌గడ్డ దేవస్థానం భూమిని కబ్జా నుంచి కాపాడాలి


మంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

పటాన్‌చెరు రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి) : రుద్రారం గణేష్ గడ్డ దేవస్థానమునకు చెందిన 797, 798 సర్వే నెంబర్లలో నాలుగు ఎకరాల భూమిని ఓ ప్రైవేట్ డెవలపర్స్ సంస్థ కబ్జా చేస్తున్నా ప్రస్తుత ఈవో పట్టించుకోవడం లేదని, గణేష్ గడ్డ దేవస్థానానికి రెగ్యులర్ ఈవోను నియమించాలని సీపీఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి బి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి జి వివేక్ వెంకట్‌స్వామిని హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి బి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆలయానికి రెగ్యులర్ ఈవో లేకపోవడంతో ఆలయ పనులలో పర్యవేక్షణ కరువైందన్నారు. ఆలయం 27 ఎకరాలలో విస్తరించి ఉన్నప్పటికీ పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రెండేళ్లుగా వినాయక చవితి లడ్డూ వేలం పాటలో వచ్చిన డబ్బులు నేటికీ దేవస్థానం హుండీలో జమ కాలేదన్నారు. రెవెన్యూ అధికారులతో సమగ్రమైన సర్వే చేయించి దేవస్థానానికి సంబంధించిన నాలుగు ఎకరాల భూమిని కాపాడాలని మంత్రిని ఈ సందర్భంగా కోరారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

నిజాంపేట/మునిపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రాంపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో యాంటీ డ్రగ్స్, సైబర్ సెక్యూరిటీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద్మారెడ్డి, కార్యదర్శి చంద్రహాస్, మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌస్, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు. మునిపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మొబైల్ వాడకం వల్ల లాభ, నష్టాలపై శుక్రవారం షీ టీమ్స్ బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం బృందం రవీందర్, వీరప్ప, సంతోషి మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు.

పటాన్‌చెరు పారిశ్రామికవాడలో సదుపాయాలు

పటాన్‌చెరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడల్లో సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పటాన్‌చెరు పారిశ్రామికవాడ పరిశ్రమల యజమానులతో కలిసి సదుపాయాల కల్పనపై ప్రత్యక్ష పరిశీలన చేశారు. అనంతరం ఆయా పరిశ్రమల యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యజమానులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తెచ్చారు. అలాగే కొత్తగా విద్యుత్‌స్తంభాలు, సీసీరోడ్లు వేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, ఐలా చైర్మన్ సుధీర్‌రెడ్డి, ట్రాన్స్‌కో డీఈ భాస్కర్‌రావు, రంజిత్, సురేందర్ పాల్గొన్నారు.

ముసురేసింది..

(5వ పేజీ తరువాయి)

చెబుతున్నారు. వరి నాట్ల పురోగతిపై వ్యవసాయశాఖ అధికారులు సమీక్షలు జరుపుతున్నారు. విత్తనాలు, ఎరువుల లభ్యతపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు.


నాగల్‌గిద్ద: నీటి కుంటలా మారిన కరస్‌గుత్తి జడ్పీహెచ్ఎస్‌కు వెళ్లే రోడ్డు

చిరుజల్లులకే చిత్తడి

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో రోడ్లన్నీ చిత్తడి ఆ మారాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో చెత్త, మురుగు రోడ్లపై నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ కింద సంగారెడ్డి పట్టణంలోని కొత్తబస్టాండ్ నుంచి కల్పకుంట వరకు బీటీ రోడ్డు గా మార్చేందుకు రూ.80 లక్షలు మంజూరవగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లాయి. ప్రస్తుతం వర్షానికి రోడ్డు గుంతలమయంగా మారింది.


కల్హేర్: మహదేవ్‌పల్లి ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో ఉర్సుల కింద బకెట్ పెట్టిన దృశ్యం

● నాగల్‌గిద్ద మండల పరిధిలోని కరస్‌గుత్తి జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డు వర్షాలకు కుంటలా మారడంతో విద్యార్థులు ఇబ్బందిపడ్డారు.

● వర్షానికి మనూరు మండలం మండల కేంద్రానికి చెందిన సుశీల ఇల్లు శుక్రవారం ఉదయం నేలకూలింది.

● కల్హేర్ మండలంలోని మహాదేవ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలోని మూడు గదులు వర్షానికి ఉరుస్తున్నాయి. నీరు పడుచున్నచోట బక్కెట్లు పెట్టి ఓ మూలన విద్యార్థులను కూర్చోబెట్టారు.

భూం'ఫట్'

(5వ పేజీ తరువాయి)

జరపకుండానే పంటలు వేస్తూ దిగుబడుల్లో నష్టం వస్తోందని వాపోతున్నారు. పంటపొలాల్లో ఎరువులు గుమ్మరించినా అధిక దిగుబడులు రావడం లేదు. పంటల దిగుబడి నేల సారం, సాగుచేసే రకం, ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువుల వాడకం వల్ల సాగు ఖర్చు పెరిగిపోవడంతో పాటు భూమి భౌతిక లక్షణాలకు ముప్పు వాటిల్లుతుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజేంద్రనగర్‌లో పరీక్షలు

భూసార పరీక్షల నిర్వహణకు ప్రస్తుతం జిల్లాలోని పాపన్నపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకున్నాం. 6వేల మట్టి నమూనాలను సేకరించి హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి పంపించనున్నాం. జిల్లా వ్యాప్తంగా 15 గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ పథకం కింద మరో 2వేల మట్టి నమూనాలను సేకరించి మెదక్‌లోని భూసార పరీక్షా కేంద్రంలో పరిశోధనలు జరపనున్నాం. ఫలితాలు అందిన తర్వాత రైతులకు సాయిల్ హెల్త్‌కార్డులు ఇస్తామని, ఈ వానాకాలం సీజన్ తర్వాత నమూనాలను సేకరిస్తాం. -దేవకుమార్, డీఏవో, మెదక్